## క్లుప్తంగా

### కృష్ణావతారంలో జగన్నాథుడు



కృష్ణావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

మునగపాక : మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లోని శ్రీ జగన్నాథుడు బుధవారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. గురువారం జగన్నాథుని పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

### కైలాసపట్నంలో 'గడప గడపకు' నేడు

కోటవురట్ల : కై లాసపట్నంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

### 1న మండలంలో జగనన్న సురక్ష

రాంబిల్లి : జూలై 1న రాంబిల్లి మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ తెలిపారు. కట్టుబోలు, మురకాడ సచివాలయాల్లో శనివారం నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నబాబురాజు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : తిమ్మాపురం రెవెన్యూ ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించినట్టు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సర్వే నెంబర్ 97-4 లో ఆక్రమణలు జరిపి ప్రహరీ గోడ నిర్మాణం చేశారని స్థానికులు కోర్టును ఆశ్రయించారని, ఈ మేరకు ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు వచ్చినట్టు చెప్పారు. తమ సిబ్బంది మండల సర్వేయర్ శ్రీమూర్తితో కలిసి ఆక్రమణలు తొలగించామన్నారు.

### నక్కపల్లి ఆస్పత్రికి ఇద్దరు వైద్యుల నియామకం



ఈశ్వరప్రసాద్



శిరీష

నక్కపల్లి : స్థానిక ఏరియా ఆస్పత్రికి ప్రభుత్వం ఇద్దరు వైద్యులను నియమించింది. ఇక్కడ పని చేస్తున్న సూపరింటెండెంట్ జనార్దన్ యలమంచిలికి బదిలీ కాగా ఆయన స్థానంలో ఈశ్వర ప్రసాద్ నియమితులయ్యారు. దంత వైద్యురాలిగా తణుకు నుంచి శిరీషను నియమించారు. వారు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నక్కపల్లి 30 పడకల ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచి రూ.3 కోట్లతో అదనపు భవనాలు నిర్మించింది. గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పిడియాట్రిషియన్‌లతోపాటు, తాజాగా మరో ఇద్దరు వైద్య నిపుణులను నియమించడంతో ఇక్కడ రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందనున్నాయి. రోజూ 300 మందికి పైగా ఓపీ ఉంటుంది. పూర్తి స్థాయి సదుపాయాలు కలిగిన ఈ ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులను నియమించడం పట్ల రోగుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

### బక్రీద్‌కు సన్నాహాలు

కశింకోట : మండలంలోని ముస్లింలు గురువారం బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. కశింకోటలోని జామియా మసీదు, నూరి మసీదు, నరసింగబిల్లిలోని మసీదుల్లో ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అనంతరం తమ ఇళ్ల వద్ద బక్రీద్ ఉత్సవాన్ని మూడు రోజుల పాటు జరపనున్నారు. నూరి మసీదులో ఉదయం 8 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ఏర్పాటు చేస్తున్నట్టు మసీదు కమిటీ ప్రతినిధులు సయ్యద్ రహ్మతుల్లా, ఎస్ఎంఎం ఆలీ తెలిపారు.



# ఆ ఇద్దరినీ నమ్మకండి..

- మేనిఫెస్టో కాపీ కొట్టిన చంద్రబాబు
- పరిణితి లేని డైలాగుల పవన్ కల్యాణ్
- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఎద్దేవా



సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : మేనిఫెస్టోను కాపీ కొట్టిన చంద్రబాబు, అసలు మేనిఫెస్టో అంటే ఏమిటో తెలియని పవన్‌కల్యాణ్ ఈ రాష్ట్రాన్ని ఎలా పాలించగలరు...వారికి ఆ అర్హత ఉందా? అని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఎద్దేవా చేశారు. కై లాసపట్నంలో రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే బాబూరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రజలకు ఇపుడు ఏదేదో చేసేస్తామంటూ ఉపన్యాసాలు దంచేస్తున్నారు. వారికి ఏనాడైనా ఇలాంటి పథకాలు అమలు చేయాలని ఆలోచన వచ్చిందా? అని ప్రశ్నించారు. టీడీపీ మేనిఫెస్టోను చూస్తే అన్ని అంశాలు కూడా జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలే కనిపిస్తున్నాయన్నారు. పవన్‌కల్యాణ్ పరిణితి లేకుండా సినిమా డైలాగులు కొడుతున్నాడని విమర్శించారు. మా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒకే ఒక పేజీలో నవరత్నాలు రూపొందించి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారన్నారు. అభివృద్ధిపై ఎవరికైనా అనుమానం ఉంటే పాయకరావుపేట నియోజకవర్గంలోని ఏ గ్రామానికైనా రండంటూ సవాల్ విసిరారు. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ వంటి అధునాతన భవనాలను తమ ప్రభుత్వం నిర్మించిందన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తున్నామన్నారు. ఒక డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేశామని, కోటవురట్ల, నక్కపల్లిలో ఆస్పత్రులను 50 పడకల ఆస్పత్రులుగా అభివృద్ధి చేశామన్నారు. కోటవురట్ల మండలంలో సుమారు రూ.3 కోట్లతో పలు రహదారులను అభివృద్ధి చేశామన్నారు. స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల ద్వారా ప్రతి కుటుంబంలోని సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. ఇవి కాకుండా ఎక్కడైనా ఒకటో రెండో సమస్యలు ఉంటే వాటిని కూడా తక్షణమే పరిష్కరించేలా జూలై ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 వేల శిబిరాలు నిర్వహించి సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్ర ప్రజలకు కారణజన్ముడంటాను అన్నారు. ఆయన ప్రభుత్వంలో పనిచేయడం ఓ గొప్ప వరంగా సగౌరవంగా చెప్పగలనన్నారు. ప్రజలకు ఇంత చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసేందుకు ఈ రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు



కైలాసపట్నంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఓ కుటుంబ పెద్దలా రాష్ట్ర ప్రజల బాగోగులను చూస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కైలాసపట్నంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అన్ని హామీలను దాదాపు నెరవేర్చారన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తూ సువర్ణ పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరి ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం కలుగుతోందన్నారు. నవరత్నాలు ప్రతి కుటుంబంలో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. సంక్షేమ క్యాలండర్ ప్రకారం క్రమం తప్పకుండా కచ్చితంగా అదే రోజున లబ్ధిదారుల అకౌంట్లలో నిధులు జమచేస్తున్నారన్నారు. తాజాగా సీఎం జగన్ బటన్ నొక్కి అమ్మ ఒడి నగదును తల్లుల అకౌంట్లలో జమ చేశారన్నారు. ఇంతలా ప్రజల యోగక్షేమాన్ని ఎవరైనా పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పాలనలో కష్టాలను గుర్తుకు తెచ్చుకోవాలని కోరారు. ఈ సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా అందాలంటే మళ్లీ జగన్‌కు అవకాశం ఇవ్వాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ ఉమాదేవి, సర్పంచు నూకరత్నం, వరహాలబాబు, పావని, ఎంపీటీసీ రమణ, మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు శ్రీపతిరాజు, శ్రీనివాసు, రామునాయుడు, ఆంజనేయులు, నానాజీ,రాంబాబు, వెంకట్, డీవీఆర్, వరహాలు, బాలేపల్లి సత్యనారాయణ, బాబీ, నీలేంద్రరావు, ఉగ్గిన ఈశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ గోపాలకృష్ణ, కో కన్వీనర్ శ్రీనివాస్, తహసీల్దారు జానకమ్మ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డీటీ సోమశేఖర్ పాల్గొన్నారు.

## రైతు పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



రైతులకు విత్తనాలు అందజేస్తున్న తోటాడ సర్పంచ్ మంగవేణి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి పేర్కొన్నారు. స్థానిక ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మితో కలిసి బుధవారం ఆర్‌బీకేలో రైతులకు రాయితీపై విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను రాయితీపై ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రైతు సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రైతు పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు ఉన్నారు.

## రైతులకు వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాయకరావుపేట : మంగవరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు వరి విత్తనాలను సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, ఎంపీటీసీ గూటూరు విజయలక్ష్మి రామగోవిందు పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులకు రాయితీపై పంపిణీ చేస్తున్న వరి విత్తనాలు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోనే పుత్రరావు, పెనుమత్య నాగేశ్వరరావు, రైతు భరోసా కేంద్రం వీఏఏ ఆర్.సాధన పాల్గొన్నారు.

## భూముల రీసర్వే వివరాలు విడుదల



సర్వే రిపోర్టులను గ్రామ సచివాలయంలో పెడుతున్న దృశ్యం

పాయకరావుపేట : గ్రామ రెవెన్యూ పరిధిలో రైతులు భూములు రీసర్వే రిపోర్టును విడుదల చేయడం జరిగిందని మండల తహసీల్దార్ కె.జయప్రకాష్ అన్నారు. డ్రోన్ సర్వే అనంతరం సర్వే వివరాలను పాయకరావుపేట గ్రామ సచివాలయంలో రిపోర్టును జెడ్పీటీసీ లంక సూరిబాబు, కె.జయప్రకాష్ నోటీసు బోర్డులో పెట్టడం జరిగింది. భూముల రీ సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే రెవెన్యూ కార్యాలయానికి తెలియజేయాలని రైతులకు కూడా సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు డి.నానాజీ, కె.సత్తిబాబు పలువురు రైతులు పాల్గొన్నారు.

## చెరువు గట్లపై మొక్కలు పెంచాలి



రేగుపాలెం చెరువు వద్ద మొక్కను నాటుతున్న ఉపాధి హామీ పథకం స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారధి

యలమంచిలి : ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువు గట్లపై మొక్కలను నాటాలని ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ మేనేజరు జిల్లా ప్రత్యేకాధికారి కె.పార్థసారధి అన్నారు. బుధవారం యలమంచిలి క్లస్టర్ కార్యాలయంలో యలమంచిలి అచ్చుతాపురం, రాంబిల్లి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సాగునీటి కాలువలు, చెరువులు ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు గట్లు పటిష్టపరచాలని ఖాళీ స్థలాల్లో గట్లపై పథకంలో భాగంగా మొక్కలు పెంచాలని అన్నారు. అనంతరం రేగుపాలెం గ్రామంలో తిరుమల చెరువులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉపాధి హామీ పథకం సంచాలకులు రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి పాల్గొన్నారు.

## ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు సిద్ధం



విత్తనాలు అందిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఖరీఫ్ సాగు కోసం అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ విస్తరణ అధికారి కె.సూర్యనారాయణ తెలిపారు. బుధవారం అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల, హరిపాలెం, ఆవ సోమవారం ప్రాంతాల్లో వరి విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ రైతులకు విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని తెలిపారు. విత్తన మొలక శాతాన్ని రైతులు పరిక్షించుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు రాజ్‌కుమార్, జాస్మిన్, సర్పంచ్‌లు కోలా అప్పలరాజు, రైతులు కోలా అబ్బాయి, కోలా నాయుడు, తేటకాల శ్రీనివాసరావు, ఇసరపు హనుమంతు, కంఠపురెడ్డి విసన్నాయుడు పాల్గొన్నారు.

రాంబిల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు సిద్ధం చేసినట్టు ఏవో సుమంత తెలిపారు. ఆర్‌జీఎల్, ఎంటీయూ 1318, సాంబ మసూరి రకాలను ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల వద్ద వీఏఏలను సంప్రదించాలని ఏవో సూచించారు.

## మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఘన నివాళులు

యలమంచిలి : మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు 102వ జన్మదిన వేడుకలు యలమంచిలి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పీవీ కాంప్లెక్స్ వద్ద పి.వి నరసింహారావు విగ్రహానికి యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి.వి.నరసింహారావు దేశ 9వ ప్రధానిగా సేవలందించారని బహుభాషా కోవిదుడిగా పేరు గాంచారని అన్నారు. ఆర్థిక సంస్కరణల్లో ప్రత్యేక మార్పులు తీసుకువచ్చి భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయంగా తెలియజేసిన గొప్ప వ్యక్తి పీవీ అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ బొద్దపు యర్రయ్యదొర, గంధం శివ, బ్రాహ్మణ సంఘం సభ్యుడు కూచిమంచి శ్రీనివాసు పాల్గొన్నారు.

## మెరుగైన విద్య అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో2 సూర్యనారాయణ

రాంబిల్లి: ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించాలని ఎంఈవో 2 వి.సూర్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన దిమిలి స్కూల్ కాంప్లెక్సు పరిధిలో 9 పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ అప్పారావు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష దోహదం



మాట్లాడుతున్న టి.సిరసపల్లి సర్పంచ్ ధనలక్ష్మి

మునగపాక : జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి పేర్కొన్నారు. సిరసపల్లి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు దక్కని వారికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అలాగే 11 రకాల సేవలు అందుతాయన్నారు. వలంటీర్లు బాధ్యతగా సర్వే చేపట్టాలన్నారు. ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఎంఎల్‌వో సంజయ్, వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు బొడ్డేడ జగ్గారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నాగులాపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

మునగపాక : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ గంది వెంకట సత్యనారాయణ పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని నాగులాపల్లిలో బీజేపీ శ్రేణులు ఇంటింటా కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు. పార్టీ జిల్లా ఐటీ కన్వీనర్ మళ్ల కాశేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ యల్లపు రాజేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేటి నాగేశ్వరరావు, మండల సోషల్ మీడియా కన్వీనర్ భాస్కరరావు, పార్టీ నేతలు దొడ్డి సత్యనారాయణ, రామ జోగినాయుడు, రాము పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ నిలుపుదల

అనకాపల్లిటౌన్ : పట్టణంలో జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా గవరపాలెం పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంతబయలు, పెదనుయ్యి, రచ్చరాళ్లు ఏరియా, చినరామస్వామి గుడి, ఎన్టీఆర్ కాలనీ, కత్రివారివీధి, దుర్గాలాడ్జి రహదారి, పెదరామస్వామి గుడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

## 10, 11 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట దీక్ష



అంగన్‌వాడీల సమస్యలపై మాట్లాడుతున్న సోమునాయుడు

అచ్యుతాపురం(అనకాపల్లి): అంగన్‌వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం జూలై 10,11 తేదీల్లో అనకాపల్లి కలెక్టరేట్ వద్ద నిర్వహించే 36 గంటల దీక్షను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.సోమునాయుడు కోరారు. అచ్యుతాపురంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల పరిపరక్షణ, ఉద్యోగ భద్రత, కనీస వేతన అమలు, పెన్షన్ స్కీం, ఈఎస్ఐ, గ్రాట్యూటీ అమలు కోసం పోరాటం చేస్తామని తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 9 సంవత్సరాలుగా అధికారంలో ఉన్నప్పటికీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. జయ, అంబికా, హేమ, నారాయణమ్మ, సావిత్రి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## సోహం ఆశ్రమంలో మహా మృత్యుంజయ హోమం

అనకాపల్లిటౌన్ : మండలంలోని బట్లపూడి గ్రామంలో అంజనేయ స్వామి గుడి వెనుక కొండపై నున్న సోహం ఆశ్రమంలో వచ్చే నెల 14 నుంచి 90 రోజులపాటు లోకకల్యాణార్థం మహా మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు కాండ్రేగుల రవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకూ ఈ మహా హోమం జరుగుతుందన్నారు. పూజలో పాల్గొనే భక్తులు ముందుగా ఆశ్రమంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూజలో పాల్గొనే భక్తులు రెండు కిలోల ఆవు నెయ్యితో పాటు, పూజాసామాగ్రిని వెంట తీసుకురావాలని కోరారు. పూజలో పాల్గొనే భక్తులకు ఉచితం భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. వివరాలకు 99669 08908 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

## కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- మృతుడు ఎస్.రాయవరం వాసి



మనోహర్ (ఫైల్)

సింహాచలం : అడవివరం ప్రధాన రహదారిపై బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలంలోని ఇందిరా న్యూ కాలనీలో నివసిస్తున్న మాస మనోహర్ (23) రాంబిల్లిలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట అడవివరం ఎస్సీ కాలనీలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై బుధవారం మధ్యాహ్నం ఎస్.రాయవరం బయలుదేరాడు. ఈ క్రమంలో అడవివరం ప్రధాన రహదారిలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి... ఎదురుగా గోపాలపట్నం వైపు నుంచి వస్తున్న కారు టీవీటవర్ కాలనీ వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతూ మనోహర్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మనోహర్ కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ నరసింహరావు, ఎస్ఐ రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు నడపడమే ప్రమాదానికి కారణమని సీఐ నరసింహరావు గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి తల్లి లేదు. తండ్రికి కూడా దూరంగా ఉంటున్నట్టు తెలిసింది. ఎస్.రాయవరంలోని ఇందిరా న్యూ కాలనీలో బంధువులతో కలిసి ఉంటున్నాడు.